# కోవెరగు

వీధి మొదట్లో ఆగి ఉన్న జీపు పక్కనే మోటారు బైకు ఆపాను. బైకు దిగి స్టాండు వేస్తోంటే జీపులోంచి హెడ్‌కానిస్టేబులు పెంచలయ్య దిగి నా దగ్గిరకు వచ్చాడు.

"కళ్యాణ మండపం ఎక్కడుంది?" అడిగాను.

"ఈ వీధి చివర ఉంది సార్."

"జీపులో ఎవరెవరున్నారు?"

"లారెన్స్, సుబ్బారావు, మూర్తి ఉన్నారు."

"పెళ్లి ఎన్ని గంటలకట?"

"పన్నెండింటికి."

"మండపం దగ్గిర మనవాళ్ళెవరున్నారు?"

"జి.కె. మఫ్టీలో ఉన్నాడు."

"అక్కడ ఎంత మంది ఉంటారేం?"

"మీరు వచ్చేముందే లోపలికి వెళ్ళొచ్చానండీ, అక్కడ ముప్ఫయి మందికన్నా ఎక్కువ ఉండరు."

"లారెన్సు సుబ్బారావు, మూర్తి జీపు దిగి నా దగ్గిరకు వచ్చి నిలబడ్డారు.

"మీరంతా ఇక్కడ ఉండండి. నేను లోపలికి వెళ్తాను. అక్కడ నాకు ఏ విధమయిన ఇబ్బంది ఎదురయినా విజిలు వేస్తాను. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వచ్చేయండి. సరేనా?" అని వీధి దీపపు వెలుతురులో చేతిగడియారం వంక చూసుకున్నాను. పదకొండూ ఇరవై అయిదయింది. ఇంకా అరగంటలో వెంకట్రావు అనే అతను తన సహోద్యోగి రాధను పెళ్లిచేసుకోబోతున్నాడు. ఈ పెళ్లి జరగకుండా చూడటం నా పని. నిజానికి నాకు ఏమాత్రం ఇష్టం లేనిపని. ఈ పని మరో ఎవరయినా నాకు అప్పగించి ఉంటే ఏదో సాకు చెప్పి తప్పించుకునే వాడిని. మా అసిస్టెంట్ కమీషనర్ స్వయాన చెప్పాక తప్పలేదు. ఆయన చిన్న విషయాల్లో జోక్యం కలిగించుకోడు. పై నుండి వత్తిడి వచ్చి ఉండాలి.

మండపం ముందు కొచ్చి నిలబడ్డాను. బయట గోడవారగా రెండు స్కూటర్లు, నాలుగయిదు సైకిళ్లు ఉన్నాయి. కార్లేమీ లేవు. గోడ మీదగా లోపలికి చూశాను. లోపల రంగు దీపాలు లేవు. జనం అట్టే లేరు. ఎటువంటి ఆడంబరం లేదు. లోపలికి నడిచాను.

నారాకతో రెండు నిమిషాలపాటు సందడి ఆగింది. అందరి దృష్టి నా వైపు తిరిగింది. పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు పెళ్లి పీటల మీద కూర్చుని ఉన్నారు. వాళ్ల ముందు బ్రాహ్మణుడు కూర్చుని ఉన్నాడు. నలుగురయిదుగురు ఆడవాళ్లు, పదిహేనూ ఇరవయి మంది మగవాళ్లు ఉన్నారు. వాళ్లు కూర్చున్న చోటుకు నడిచాను. ఆ సమయంలో నా రాక వాళ్లకు ఇబ్బందికరంగా ఉన్నట్టు నాకు స్పష్టంగా తెలుస్తోంది. పెళ్లి కూతురు ముఖంలోకి చూశాను. చామనచాయలో చక్కగా ఉంది. ఆమెకు ఇరవై అయిదు సంవత్సరాలుంటాయేమో పెళ్లి పట్టుచీరలో ఏ మేకప్పు లేకుండా నాజూకుగా ఉంది. ఆమె మెడవంక చూశాను. మెడలో ఒంటిపేట గొలుసు మటుకు ఉంది. బుగ్గన చిన్న నల్లటి మచ్చ ఉంది. మంగళసూత్రధారణ ఇంకా జరగలేదు. నా చూపులు పెళ్ళి కొడుకు మీదకు జరిపాను. అతను ఎర్రగా ఉన్నాడు. అంత లావూ కాదు, సన్నమూ కాదు. మనిషి అందగాడేమీకాదు కాని ఆకర్షణీయంగా ఉన్నాడు. నా రాకకు భయపడుతున్నట్టు అనిపించింది. అతని చేతుల్లో మంగళసూత్రం ఉంది. కట్టాలో, వద్దో తనకే తెలియకుండా ఉన్నట్టుంది. చటుక్కున పెళ్లి కూతురు వైపు తిరిగి, “మీపేరు రాధకదూ?” అన్నాను.

ఆమె ఏదో అనబోయింది కాని అనలేదు. తలూపింది. ఆత్మ విశ్వాసం ఉన్న మనిషిలా నిబ్బరంగా ఉంది.

“ఈ పెళ్లి జరగటానికి వీల్లేదు. అంతా ఆపేయండి” అరిచినట్టుగా అన్నాను.

బ్రాహ్మణుడు లేచి దూరంగా వెళ్లి నుంచున్నాడు. చిన్న హాలులోని గాలి స్థంభించింది. నిశ్శబ్దం గడ్డకడుతుండగా “ఎందుకు వీల్లేదు?” నా అంత గట్టిగానే అడిగింది రాధ. ఆమె పెదాలు వణుకుతున్నాయి. కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

“వీల్లేదంటే వీల్లేదు” అన్నాను. నాకు ఆర్గ్యూమెంట్స్ చేయటం చాతకాదు. నా పాయింటు బలహీనంగా ఉన్నప్పుడు అరిచినట్టు మాట్లాడటం నాకు అలవాటు. ఆ అరుపుకు ఎదుటివాళ్లు భయపడుతుంటారు. ఈ మాట అనీ అనగానే ఎవరో నాకాళ్లమీద పడ్డారు. ఈ చర్య నేను ఊహించలేదు. ఆశ్చర్యపోతూ నాకాళ్లు తన రెండు చేతులతో పట్టుకున్న ఆవిడ వంక చూశాను. ఆవిడకు యాభయి అయిదు సంవత్సరాల వయసు ఉంటుంది. ఎర్రగా, పొట్టిగా, లావుగా ఉంది. ముందు ఆవిడ పెళ్ళికొడుకు తాలూకు

మనిషయి ఉంటుందనుకున్నాను. "బాబూ! ఇన్‌స్పెక్టరు బాబూ! నీకు తల్లిలాటిదాన్ని. నీకాళ్లు పట్టుకుని ప్రాధేయపడుతున్నాను. ఈ పెళ్లి ఆపకు. జరగనీయి. అమ్మాయి, అబ్బాయి ఇష్టపడే పెళ్లి చేసుకుంటున్నారు. దయచేసి అడ్డురాకుబాబూ" ఏడుస్తూ అంటుంటే ఏం చేయాలో నాకు తోచలేదు. కాళ్లు వెనక్కి లాక్కుని, "లెండమ్మా. తప్పు" అన్నాను.

ఆమె లేచి కూర్చుంది. ఆమె కళ్లు ఎర్రగా నీళ్లతో నిండి ఉన్నాయి.

"మీరు పెళ్ళికొడుకుకు ఏమవుతారు?" అడిగాను.

"ఏమీకాను. అతని ఇల్లుగలావిడను. అంతే. ఈ ఇద్దరికీ ఒకరంటే మరొకరికి ఎంతిష్టమో నీకు ఎలా చెప్పాలో నాకు అర్థం కావటం లేదు." అంటూ రెండు చేతులు జోడించి, "ఈ పెళ్ళి జరగనీయి బాబూ" అంది.

ఆమె మాటలకు నా మనసు కరిగినమాట అబద్ధం కాదుగాని నేను కొద్దిగా మెతకబడేసరికి ఇదే అదననుకొని పెళ్లి కొడుకు రాధ మెడలో తాళి కట్టేసరికి కోపాన్ని ఆపుకోలేకపోయాను. నా కళ్లముందే వాళ్ల పెళ్లి జరిగి పోయిందని మా ఎ.సి.పికి తెలిసిందంటే నా పని ఫినిష్. ఊరుకోడు. నాకెన్ని బాధలు ఎదురవుతాయో నేను ఊహించగలను. ఆవేశంతో ఆమె మెడలో చేయిపెట్టి పసుపుతాడు అందుకుని గుంజగానే ఊడివచ్చింది. పెళ్లికొడుకు నా చేయి పట్టుకుని వారించబోతుంటే ఒక్క నెట్టు బలంగా నెట్టాను. అతను వెనక్కి పడ్డాడు. రాధ పీట మీంచి లేచి ఏడవటం మొదలెట్టేసరికి జి.కె ముందు కొచ్చి పెళ్ళికొడుకును పట్టుకున్నాడు. ఏ గొడవా జరగకుండా జేబులోంచి ఈలతీసి రెండుసార్లు గట్టిగా ఊదాను. బిలబిల మంటూ పోలీసులు లోపలికి ప్రవేశించారు.

పోలీసులను చూడగానే ఒక్కొక్కరే నెమ్మదిగా జారుకోసాగారు. నిమిషంలో అయిదారుగురు తప్ప అందరూ వెళ్ళిపోయారు. "మీ ఇద్దరూ నాతో పాటు పోలీసు స్టేషనుకు రావాలి" అన్నాను. నేను చేసిన పనికి నాకూ బాధగా ఉంది. నేనీ ఉద్యోగంలో ఇమడలేని మనిషిని.

రాధ తల అడ్డంగా ఆడించి, "దిసీజ్ టూ మచ్. మీరు చేస్తుంది జులుం. ఇంత అన్యాయంగా మమ్మల్ని విడదీయటం భావ్యం కాదు. నేను మైనర్‌ను కాను. మా పెళ్లికి ఎవరి బలవంతం లేదు" అంది ఏడుస్తూ.

ఆమె ముఖంలోకి చూసి మాట్లాడటానికి నాకు ధైర్యం చాలటంలేదు. "నన్ను క్షమించండి. మీరు చెప్పదల్చుకుంది. మా పోలీసు స్టేషన్‌కు వచ్చి మా ఎ.సి.పి గారితో చెప్పుకోండి" అని ఆమె జవాబుకోసం ఎదురు చూడకుండా జి.కె. వంక చూసి, "వీళ్ళను

స్టేషన్‌కు తీసుకు రండి" అని బయటకు నడిచాను. తాళిబొట్టు తాడు జేబులో వేసుకుని మోటారు బైక్ ఎక్కి స్టార్ట్ చేశాను.

పోలీస్ స్టేషన్‌కు చేరుకుని టీ తెప్పించుకుని తాగిన తర్వాత సిగరెట్ వెలిగించానో లేదో జీప్ వచ్చి స్టేషన్ ముందాగింది. జీప్ లోంచి ముందు రాధ దిగింది. ఆమె వెనక మరో ఇద్దరు పెద్దమనుషులు, ఒక మధ్య వయస్కురాలు దిగారు. వెంకట్రావు రాలేదు. వాళ్ళు నా గదిలోకి రాగానే నా ఎదురుగా ఉన్న ఖాళీ కుర్చీలు చూపించి కూర్చోమన్నాను. రాధతో వచ్చిన వాళ్లు ఇబ్బందిగా కూర్చున్నారు. రాధ కూర్చోలేదు.

"కూర్చోండి. ఆయనేడి?" అడిగాను.

బల్లమీద చేతులు పెట్టి, "నన్నిక్కడకు ఎందుకు పిలిపించారు?" కోపంగా అడిగింది.

"మీకు వెంకట్రావు గారితోపెళ్ళికాలేదని రాసివ్వండి" అని ఒక తెల్ల కాయితం, బాల్‌పెన్ ఆమె ముందుంచాను.

"మాకు పెళ్లి అయింది. మీ కళ్లముందే అతను నా మెడలో తాళి కట్టాడు కదా?"

సిగరెట్ ఏష్‌ట్రే మీద పెట్టాను. ఆమె ప్రశ్నకు ఏమని జవాబు చెప్పాలో నాకు అర్థం కావటం లేదు.

"మీ ఎ.సి.పి. గారేరి? నన్నాయనతో మాట్లాడనీయండి."

"నేనిక్కడకు వచ్చేముందే బయటకు వెళ్లారు. ఎక్కడికి వెళ్ళారో నాకు తెలియదు." అబద్ధం చెప్పాను.

"మీరు మనుషులు కాదు. రాళ్ళు. నేను మీ ఎ.సి.పి. ఫోను నంబరడిగినా మీరు చెప్పరు.... నాకు ఒక్క విషయం చెప్పండి. ఇలా చేయమని మీకెవరు ఆదేశాలిచ్చారు? మమ్మల్ని విడదీయటం అన్యాయం అని మీకు అనిపించటం లేదూ?" కోపంగా అడుగుతోంది. కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి. తన బాధ కక్కేస్తే గుండె తేలికవుతుందని నాకు తెలుసు. ఆవేశం తగ్గుతుంది. నా నిస్సహాయత నా ముఖంలో కనిపిస్తుందనుకుంటాను. ఆమె అంది, "దీనికంతటికీ కారణం మా పెదనాన్న నరసింగరావని నాకు తెలుసు. నేను మిమ్మల్ని, మీ పరివారాన్ని కోర్టుకు లాగకపోతే నా పేరు రాధకాదు. గుర్తుంచుకోండి. నన్నింత హైరాన పెడుతున్నందుకు నా ఉసురు మీకు తప్పకుండా తగులుతుంది....ఆ," కళ్లనీళ్లు తుడుచుకుంటూ వెనక్కి తిరిగింది.

"మాట" అన్నాను.

ఆగింది.

"మీ తాళిబొట్టు తాడు తీసుకు వెళ్లండి" ఆమెకు అందించ బోయాను.

ఆమె తీసుకోలేదు. "మీ ఎ.సి.పి. చేత నరసింగరావు గారి మెడలో వేయించండి." అని చరచరా బయటకు నడిచింది. ఆమె కూడా వచ్చిన వాళ్లు లేచి ఆమెను అనుసరించారు. జడివాన కురిసి వెలిసినట్లయింది. తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.

అరగంట తర్వాత ఎ.సి.పి గారి నుండి ఫోను రాగానే జరిగినదంతా చెప్పాను. ఆయనకూ ఈ పని నచ్చలేదనుకుంటాను. ఎప్పటిలా 'వెరీగుడ్' అనేం అనలేదు. దీర్ఘపు నిట్టూర్పు వినిపించింది. "రేపటినుండి రెండు రోజులపాటు సెలవు మీద వెళ్ళు." అన్నాడు.

"సరేసార్" అని ఫోను పెట్టేయబోతూ, "నరసింగరావుగారు ఎవరుసార్?" అడిగాను.

ఆయన వెంటనే జవాబు జవాబు చెప్పలేదు. కొద్దిసేపు మౌనంగా ఉండి, "నాకు తెలియదు" అన్నాడు. ఆయన మాట నమ్మబుద్ధి కాలేదు.

రెండు రోజుల సెలవు పూర్తి కాకముందే నాకు కరీంనగర్ బదిలీ అయింది. కరీంనగర్ మా స్వస్థలం.ఎప్పటి నుండో అడుగుతోంటే ఇప్పటికి ఇచ్చారు. అక్కడో ఇల్లు కట్టుకోగలిగాను. అక్కడ మూడు సంవత్సరాలు పనిచేశాక మళ్లీ హైదరాబాదుకు బదిలీ అయింది. కొత్త స్టేషన్‌కు అలవాటు అవుతుండగా ఒక సాయంత్రం అయిదు గంటల సమయంలో ఖరీదయిన కారు మా స్టేషన్ ముందు ఆగింది. కారు లోంచి ఒడ్డూ, పొడుగూ ఉన్న మనిషి దిగాడు. అతనికి ముప్ఫయి సంవత్సరాలుంటాయి. చక్కగా ఉన్నాడు. అతని వెనక దిగిన రాధను చూసి ఆశ్చర్యపోయాను. వాళ్లిద్దరూ నా గదిలోకి వచ్చాక అతను తనను తను పరిచయం చేసుకుని రాధను తన భార్యగా పరిచయం చేశాడు. యూనిఫాంలో పోలీసులం ఒకే విధంగా కనిపిస్తామేమో రాధ నన్ను గుర్తుపట్టినట్లనిపించలేదు.

"మేము ఎయిర్ పోర్టుకు వెళ్తూ పెట్రోలు పోయించుకోటానికి ఈ వీధి చివర్లోని బంకు దగ్గిర ఆగాము. నేను కారు దిగి పెట్రోలు పోయించుకుంటుండగా ఎవడో నా భార్య దగ్గిరకు వచ్చి ఆమె మెడలోని మంగళసూత్రం లాక్కుని పారిపోయాడు. అక్కడే మీ కానిస్టేబులు ఉంటే అతనికి చెప్పాను. మీ కానిస్టేబులు మరికొంత మంది దొంగ వెంటపడ్డారు. మా మామయ్య నరసింగరావు గారు. ఆయన గురించి మీకు తెలుసు అనుకుంటాను. ఆయన్ని రిసీవ్ చేసుకోటానికి ఎయిర్ పోర్టు వెళ్తుంటే ఈ దొంగతనం జరిగింది. గంటలో తిరిగి వచ్చి మీకు కంప్లెయింట్ రాసిస్తాను. టైంలేదు. ఈ సరికి ఫ్లైట్ వచ్చేసి ఉంటుంది. ఏమనుకోకండి" అన్నాడు.

నా జవాబు కోసం ఎదురుచూడకుండా వెళ్లిపోయారు. పావుగంట తర్వాత కానిస్టేబులు రెహమాన్ మంగళసూత్రం దొంగిలించిన మనిషిని స్టేషన్‌కు తీసుకు వచ్చాడు. రాధంత సులువుగా వెంకట్రావును గుర్తు పట్టలేకపోయాను. గుడ్డలు మాసిపోయి ఉన్నాయి. గడ్డం పెరిగి ఉంది. కళ్లు లోతుకుపోయి మనిషి సన్నగా ఉన్నాడు. రెహమాన్‌ను బయటకు పంపించి వెంకట్రావును కూర్చోమని నా ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాను. ముందు తటపటాయించి బెరుకుగా కూర్చున్నాడు. సిగరెట్ పెట్టె అతని ముందుకు నెట్టి, "సిగరెట్ తీసుకోండి" అన్నాను.

"థేంక్స్! అలవాటు లేదు" అన్నాడు తలవంచుకుంటూ.

సిగరెట్ వెలిగించాను. ముందుకు వంగి, "ఇందాక రాధ, ఆమె భర్త శ్రీహరి ఇక్కడకు వచ్చారు" అన్నాను.

వెంకట్రావు తలపైకెత్తి నాకళ్లల్లోకి సూటిగా చూసి ముఖం మీద పడిన జుట్టును వెనక్కి నెట్టుకుంటూ "రాధ ఎవరు?" అడిగి వెంటనే తల తిప్పి కిటికీలోంచి బయటకు చూడసాగాడు. అతని కళ్లల్లో తిరుగుతున్న నీరు నేను చూడటం అతనికి ఇష్టం లేదనుకుంటాను.

అరగంట తర్వాత ఎయిర్‌పోర్టు నుండి రాధ ఫోను చేసింది.

"దొంగ దొరికాడు. మీ మంగళసూత్రం దొరికింది. ఎయిర్‌పోర్టు నుండి వెళ్ళేప్పుడు కలెక్ట్ చేసుకోండి...." అంటుంటే నా మాటలకు అడ్డు వచ్చి, "నాకో సహాయం చేసి పెట్టండి" అంది.

"చెప్పండి."

"ఇప్పుడు వెంకట్రావు ఎక్కడ ఉన్నాడు?"

"నా ఎదురుగా కూర్చుని ఉన్నాడు."

"మేము మీ స్టేషన్‌కు వచ్చేలోపల వెంకట్రావును వదిలిపెట్టేయండి. ప్లీజ్... అతను మా పెదనాన్న కంటబడితే ఎంత గొడవ అవుతుందో నేనూహించగలను..." రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత ఫోను కట్ అయింది.

◆ ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 20 ఏప్రిల్ 1984